క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మండల పరిధిలోని కంసాన్‌పల్లిలో ఆంజనేయస్వామి, శివలింగ, మహాగణపతి, కుమారస్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. సర్పంచ్ బసిరెడ్డి పద్మ, మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, హోమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సుందరపురం, కొత్తపేటలో 'వికసిత్ భారత్'



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. బుధవారం మండల పరిధిలోని సుందరపురం, కొత్తపేట గ్రామాల్లో ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య, సుందరపురం సర్పంచ్ రాములు నాయక్, మండల వైద్యాధికారి డాక్టర్ నిహారిక, రొల్లు రఘురాంగౌడ్, మోటె శ్రీను, నోడల్ అధికారి రావణ్య, బ్యాంక్ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ భూపాలచారి

కొందుర్గు: పెద్ద ఎల్కిచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థుల సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల సర్పంచ్ భూపాలచారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సౌకర్యార్థం ఇదే పాఠశాలలో 1995–96లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు రూ.లక్షతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్యం, ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు ఉపాధ్యాయులు భాగ్యజ్యోతి, శంకర్, నాగేశ్, బాలు, శ్రీను, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

మొయినాబాద్: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం గురువారం మొయినాబాద్ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు మాణయ్య తెలిపారు. ఉదయం 9 గంటలకు మొయినాబాద్ చౌరస్తాలో పార్టీ జెండా ఆవిష్కరిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి ప్రజాపాలన



శంకర్‌పల్లి: మాట్లాడుతున్న పీడీ ప్రభాకర్



షాబాద్: సమావేశంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి

- 28 నుంచి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం
- ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కూడా భాగస్వామ్యం : డిప్యూటీ డీఎంహెచ్ఓ



చేవెళ్ల: సూచనలిస్తున్న హిమబిందు, విఠలేశ్వర్‌జీ



కొందుర్గులో ఎంపీడీఓ అంజనేయులు

చేవెళ్ల: గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వం గురువారం నుంచి ప్రారంభించనున్న ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం పథకాల అమలుకు దరఖాస్తుల స్వీకరణను విజయవంతం చేయాలని చేవెళ్ల ఎంపీడీఓ బి హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీలు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు గడువులోపు దరఖాస్తులను స్వీకరిస్తారని ప్రతి పంచాయతీలో కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వారు చెప్పారు. మండలంలో మొత్తం నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. గ్రామ సభలు లేని గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి దరఖాస్తులు స్వీకరిస్తుంటారని ఏరోజుకారోజు వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉంటుందన్నారు. ఒకే దరఖాస్తు ఫారంలో కుటుంబసభ్యులంతా కలిసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ విషయంలో ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదని ఇది కేవలం దరఖాస్తు మాత్రమేనని దీనిని మళ్లీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేయించి ఏ పథకాలకు ఎవరెవరు అర్హులని నిర్ధారించిన తరువాతనే ఆ పథకాలు అందుతాయని చెప్పారు. ఒకే కుటుంబంలో అన్ని పథకాలకు అర్హులైతే అన్ని పథకాలకు టిక్ చేసి సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఒకేరోజు ఇవ్వాల్సిన పని లేదని జనవరి 6వరకు ఎప్పుడు వీలైతే అప్పుడు ఈ దరఖాస్తులను సమర్పించొచ్చని చెప్పారు.

మొదటిరోజు..

మొదటిరోజు మండలంలోని ఆరు గ్రామాల్లో ఈ ప్రజాపాలన ప్రారంభం, గ్రామ సభలు ఉంటాయని చెప్పారు. చేవెళ్లలోని మండలస్థాయి అధికారులతో నాలుగు టీమ్‌లుగా ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ హిమబిందు ఆధ్వర్యంలో రెండోది ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, మూడోది తహసీల్దార్ కృష్ణయ్య, నాలుగోది మండల వ్యవసాయాధికారి తులసీ టీమ్‌లుగా విధులు నిర్వహిస్తారు. మండలంలోని అన్ని గ్రామ సభల్లో వారు పాల్గొంటారు. మొదటిరోజు చేవెళ్ల, ఆలూరు, అల్లవాడ, గుండాల, ముడిమ్యాల, రావులపల్లి గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలన అభయహస్తం పథకాల అమలులో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కూడా భాగస్వామ్యం అవుతారని డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ పేర్కొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: ప్రజా పాలన దరకాస్తులను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారి, ఉపాధి హామీ పీడీ ప్రభాకర్ పేర్కొన్నారు. ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీడీఓ వెంకయ్య గౌడ్, తహసీల్దార్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీవో హన్మంత్‌రెడ్డి, ఏఓ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు మాట్లాడుతూ మండల పరిధిలోని 12 గ్రామాల్లో ప్రజా పాలనలో భాగంగా అధికారులు ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

కొందుర్గు: అభయహస్తం దరఖాస్తులు ప్రతీ కుటుంబం నుంచి స్వీకరించాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. తహసీల్దార్ రమేశ్ కుమార్ పాల్గొన్నారు. చౌదరిగూడలో ఎంపీడీఓ మహేశ్‌బాబు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : ప్రజా పాలన విజయవంతం చేయాలని ఆర్డీఓ వెంకట మాధవరావు సూచించారు. ఎంపీడీఓ వినయ్‌కుమార్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ వెంకట్ రాం రెడ్డి, ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్ పాల్గొన్నారు.



క్యూ కట్టిన మహిళలు

ఈకేవైసీ కోసం పడిగాపులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీ ఎదుట బుధవారం మహిళలు ఈకెవైసీ నమోదు కోసం బారులు తీరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్న నేపథ్యంలో గ్యాస్ కనెక్షన్‌కు ఈకెవైసీ ఉంటేనే సబ్సిడీ వస్తుందని వదంతులు రావడంతో గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారులు పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు మాత్రం తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఈకెవైసీ నిరంతర ప్రక్రియ అని చెబుతున్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్

రిటైర్డు జడ్జి సాంబశివరావు



కేసులు పరిష్కరిస్తున్న సాంబశివరావు, సీఐ సైదులు

చేవెళ్ల: పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని రిటైర్డు జడ్జి సాంబశివరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసుల కోసం లోక్ అదాలత్ బుధవారం మూడో రోజు కూడా కొనసాగింది. రెండో రోజు 144 కేసులు పరిష్కరించబడినట్లు తెలిపారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనదారులపై నమోదైన కేసులను వెంటనే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు లోక్‌అదాలత్ కొనసాగుతుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్ఐ విఠల్‌రెడ్డి, సిబ్బంది కవిత, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దేవమ్మ సేవలు చిరస్మరణీయం

కొందుర్గు: పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా దేవమ్మ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంఈఓ కిష్టారెడ్డి అన్నారు. బుధవారం కొందుర్గు బాలుర ప్రాథమికోన్నత పాఠశాలలో దేవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని అభివృద్ధి చేసిన ఘనత దేవమ్మదే అన్నారు. ఆమె అకాల మరణం అందరిని కలచివేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరప్రసాద్, లక్ష్మీదేవి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీని పరామర్శించిన నేతలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డిని బుధవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పరామర్శించారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తల్లి ఈశ్వరమ్మ దశ దిన కర్మ హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన నేతలు ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, తాండ్ర శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతో ముందడుగు

టెక్ మహేంద్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ స్వామినాథన్ మణి

శంకర్‌పల్లి: విద్యార్థులు తమ భవిష్యత్‌కు సంబంధించి నూతన ఆలోచనలతో ముందడుగు వేయాలని టెక్ మహేంద్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ స్వామినాథన్ మణి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని దొంతాన్‌పల్లి గ్రామ శివారుల్లోని ఇక్ఫాయి ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం అమృత్ కాల్ విమర్స్ వికసిత్ భారత్ 2047 పేరిట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమ ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం ఎంతో ముఖ్యం అన్నారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకొనేందుకు ఉత్సాహం చూపాలన్నారు. ఉప కులపతి ఎల్ఎస్ గణేశ్, డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేగంగా 'తహసీల్' భవన నిర్మాణం

- పూర్తి కావస్తున్న నిర్మాణ పనులు
- రెండేళ్లుగా పాల కేంద్రంలో సేవలు
- త్వరగా అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు
- జనవరిలో ప్రారంభించే అవకాశం



నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

కడ్తాల్: రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. 2016 అక్టోబర్‌లో కడ్తాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయాన్ని స్థానిక పాలశీతలీకరణ కేంద్రంలోని రైతు సమావేశ భవనంలో నిర్వహిస్తూ వస్తున్నారు. భవనం ఇరుకుగా ఉండటంతో సిబ్బందితో పాటు సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నూతన భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

సాగుతున్న పనులు..

2021లో అప్పటి ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ.68 లక్షలు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేసింది. అదే ఏడాది డిసెంబర్ 14న ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే నిధుల కొరతతో పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. దీంతో నిధులు కేటాయించి తహసీల్దార్ కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని కాంగ్రెస్ నాయకులు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలోనే రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు విడుదల కావడంతో నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. జనవరి చివరి వారంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

తీరనున్న సమస్య

ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో ఎలాంటి సౌకర్యాలు లేవని, నూతన భవనాన్ని త్వరగా ప్రారంభిస్తే, సిబ్బందితో పాటు ప్రజలు, రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది. త్వరగా పనులు పూర్తి చేసి, భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

రేపటి నుంచి సాయంకాలం మార్కెట్..

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతుల కోసం సాయంకాలం మార్కెట్ శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకట రంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్ల ప్రాంతంలోని రైతులకు అందుబాటులో మార్కెట్ సౌకర్యం కల్పించాలనే ఆలోచనతో సాయంకాలం మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన చెప్పారు. క్యారెట్ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి మార్కెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులు క్రయ విక్రయాల నిమిత్తం గుడిమాల్కాపూర్, బోయిన్‌పల్లి మార్కెట్‌లకు వెళ్లొద్దన్నారు. అక్కడి నుంచి కొనుగోలు దారులు (ట్రేడర్స్) ఇక్కడికే వచ్చి వేలం పాటలో పాల్గొంటారన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా క్యారెట్ పండించే రైతులు ఉన్నారని, వారి కోసం మొదలు పెడుతున్నామన్నారు. దీన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి సూచించారు. రైతుల కోసం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అందరూ సహకరించి విజయవంతమయ్యేలా చూడాలని కోరారు.

అయ్యప్ప దేవాలయంలో అన్నదానం



పూజలో అయ్యప్ప స్వాములు

షాద్‌నగర్: శ్రీ శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో బుధవారం పట్టణానికి చెందిన లక్ష్మీ, శ్రీనివాస్ దంపతులు అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి వీరాచారి, బంగారు కృష్ణయ్య, ప్రవీణ్, రఘునందన్, రాజు, పెంటయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి నిరంతర కృషి



పట్నం అవినాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మాజీ మంత్రి కేటీఆర్‌కు బొకే అందజేస్తున్న పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌కు బొకే అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ పేదల అభివృద్ధికి నిరంతరం తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, శంభీభీపూరి రాజు, చేవెళ్ల, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు నర్సింగ్‌రావు, పీసరి సతీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నగరంలోని వారి నివాసాలకు వెళ్లి వారికి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేవెళ్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. పీసీసీ ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

కొడంగల్ రూరల్ : పట్టణంలోని రహదారి పక్కన ఉండే పలువురు యాచకులకు బుధవారం మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ దుప్పట్లు అందజేశారు. చలి తీవ్రత పెరుగుతోందని, ఎలాంటి ఆధారంలేని నిస్సహాయులు చలికి తట్టుకోలేక ఇబ్బంది లకు గురవుతున్నారనే ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సయ్యద్ వహేద్ రజ, ఎంఏ.రహీమ్, సయ్యద్ ఖలేద్, గులాం అమర్ పాషా, సయ్యద్ అశ్ఫక్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బంగారు భవిష్యత్

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధి వర్మ



ఎన్నోవేషన్ ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: డిజైన్ కింగ్ ఎన్నోవేషన్ ప్రాజెక్టు ఎక్స్‌పోతో విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధి వర్మ అన్నారు. బుధవారం అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీ కళాశాలలో ఒక్క రోజు డిజైన్ కింగ్ అండ్ ఎన్నోవేషన్ కార్యక్రమాన్ని మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి 80కి పైగా బృందాలు పాల్గొన్నారు. అనంతరం ప్రాజెక్టును ఉద్దేశించి వైస్ చాన్స్‌లర్ పార్థసారధి వర్మ మాట్లాడుతూ విద్యార్థులు విప్లవాత్మక ఆలోచనలతో వ్యవహరించాలన్నారు. ఉద్యోగాలకే పరిమితం కాకుండా భవిష్యత్‌లో సమాజ అభివృద్ధికి తోడ్పడే విధంగా ఎదగాలన్నారు. సాంకేతికత, స్మార్ట్ ఎడ్యుకేషన్‌లతో పాటు లాజిస్టిక్స్ వ్యవస్థలు పునరుత్పాదకత, ఇన్నర్ ఆవిష్కరణలు, రోబోటిక్స్, డ్రోన్‌లు, స్మార్ట్ వాహనాలు, ఆటోమెటిక్ ప్రాజెక్టులు విజ్ఞానంతో నిర్వహించాలన్నారు.